క్లుప్తంగా

ఘనంగా సామూహిక పొంగళ్లు



సామూహిక పొంగళ్లు పెడుతున్న మహిళలు

చిల్లకూరు : మండల కేంద్రమైన చిల్లకూరులోని దళితవాడ గ్రామ దేవత సుందరమ్మకు ఆదివారం గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. గ్రామ దేవతకు ప్రతి ఏటా మహిళలు సామూహిక పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. ఈ క్రమంలో రెండు రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు చేస్తున్నారు. ఆదివారం సామూహిక పొంగళ్లు పెట్టి, మొక్కులు చెల్లించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా చేపట్టారు.

మూలన పడిన ఆర్వో వాటర్ ప్లాంట్



నెలబల్లి పాఠశాలలో మూలన పడిన ఆర్వో వాటర్ ప్లాంట్

దొరవారిసత్రం : మండలంలోని నెలబల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శుద్ధి నీరు అందించాలనే తలంపుతో గత ప్రభుత్వం మన బడి నాడు-నేడు కింద లక్షలు వెచ్చించి ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. నిర్వహణ చేపట్టకపోవడంతో మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారింది. తర్వాత దాని గురించి అధికారులు పట్టించుకోలేదు. పాఠశాలలో ఉన్న 50 మందికి పైగా ఉన్న విద్యార్థులు ఇళ్ల నుంచి బాటిళ్లలో నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

ఉత్సాహంగా సాగుతున్న క్రికెట్ పోటీలు



72 పరుగులు చేసిన దినేష్‌వర్మ



5 వికెట్లు తీసుకున్న ఆంజనేయులు

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని తారకరామా క్రీడా ప్రాంగణంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్‌జోన్ సీనియర్ విభాగం క్రికెట్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఆదివా రం కర్నూలు–చిత్తూరు జట్లు తలపడ్డాయి. సెకండ్ ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 48.4 ఓవర్లకు 170 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఈ జట్టులో దినేష్ వర్మ 74 పరుగులు చేశాడు. కర్నూలు జట్టు బౌలింగ్ విభాగంలో ఆంజనేయులు 5 వికెట్లు, ఇస్మాయిల్ 3 వికెట్లు తీసుకున్నారు. 54 పరుగుల తేడాతో కర్నూలు జట్టు ఆధిక్యంలో ఉంది.

రామాలయంలో చోరీ

సైదాపురం: మండలంలోని గిద్దలూరు పంచాయతీ ఇసకపల్లిలో ఉన్న రామాలయంలో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. అమ్మవారి మంగళసూత్రం, హుండీని పగులగొట్టి అందులో ఉన్న నగదును చోరీ చేశారు. స్థానికులు ఆదివారం ఉదయం ఆలయం వద్దకు వచ్చి చూసి చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ డీఎస్ విజయ్‌కుమార్ ఆలయాన్ని పరిశీలించారు. హుండీలో సుమారు రూ.10 వేల వరకు నగదు ఉండవచ్చని స్థానికులు తెలిపారు. పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం



ఆలయం వద్ద రక్తదానం చేస్తున్న భక్తులు

నాయుడుపేట టౌన్ : మండలంలోని అత్తలపాళెంలో నిర్మించిన పెద్ద పొళెపమ్మ ఆలయ కుంభాభిషేకాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద మూడు రోజులు ప్రత్యేక హోమాలు చేశారు. ఆదివారం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మునీశ్వర స్వామి ఆలయ ట్రస్టు సభ్యుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ కాకు మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ నెలవాయి కళ్యాణమ్మ, కాకు మాధవరెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, జనార్ధన్ రెడ్డి, దువ్వూరు కృష్ణవేణమ్మ, శ్రీపతిరెడ్డి సుకన్య తదితరులు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు అండగా ఉంటాం

గూడూరు రూరల్ : గూడూరులోని నిమ్మ మార్కెట్‌లో పని చేసే ముఠా కార్మికులకు అండగా ఉంటా మని మార్కెట్ ప్రతినిధులు తెలిపారు. నిమ్మ మా ర్కెట్‌లో ముఠా వర్కర్ల కోసం నిర్మించిన విశ్రాంతి భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ నిమ్మ మార్కెట్‌లో నెలకొన్న సమ స్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన అంగళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ ప్రతినిధులు సిద్ధారెడ్డి, మీరారెడ్డి, వెంకటేశ్వరరాజు, చెంచురామయ్య, మస్తాన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అంటగడుతున్న నకిలీ సీడ్



చిన్న సైజులోనే పట్టిన రొయ్యలు



వాలమేడు వద్ద ఉన్న రొయ్యల చెరువు

రొయ్యపై సిండికేట్ల దెబ్బ

డాలర్ల పంటగా పేరు గాంచిన ఆక్వా సాగుపై సిండికేట్ల దెబ్బ పడింది. నాశిరకం, ఫీడ్, సీడ్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. దీనికితోడు ప్రకృతి వైపరీత్యాలతో రొయ్యల దిగుబడి తగ్గుతోంది. సాగులో ఉత్పాదక వ్యయం పెరగడం, ధరల పతనంతో ఆక్వా పరిశ్రమ సంక్షోభంలో పడింది. యూరోపిన్ దేశాలకు ఎగుమతులు తగ్గిపోయాయని, రొయ్యలకు డిమాండ్ లేదని చెబుతూ వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నారు. ఫలితంగా కొందరు ఆక్వా రైతులు ఇప్పటికే సాగుకు దూరమై చెరువులను పంట పొలాలుగా మార్చేశారు. మరికొంతమంది సాగుకు దూరమయ్యేందుకు సిద్ధమవుతున్నారు.

– వాకాడు

- నాశిరకం ఫీడ్, సీడ్ అమ్మకాలు
- తగ్గుతున్న రొయ్య ఉత్పత్తులు
- పెరుగుతున్న సాగు పెట్టుబడులు
- నష్టాలతో ప్రశ్నార్థకంగా మారిన సాగు
- పంట పొలాలుగా మారుతున్న రొయ్యల చెరువులు



రొయ్యల విక్రయాలు జరుపుతున్న రైతులు, (ఇన్‌సెట్) వివిధ సైజుల్లో పెరిగిన రొయ్య పిల్లలు

తిరుపతి జిల్లాలోని ఏడు మండలాల్లో సముద్రం తీరం ఉంది. సుమారు 77 వేల ఎకరాల విస్తీర్ణంలో 8 వేల మందికి పైగా ఆక్వా రైతులు రొయ్యల సాగు చేస్తున్నారు. తిరుపతి, నెల్లూరు జిల్లాల ఆక్వా రైతుల నుంచి సుమారు రూ.16 వేల కోట్ల ఆదాయం సమకూరుతోంది. దీన్ని పసిగట్టిన రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి వారు నిర్ణయించిన ధరకే కొనుగోళ్లు చేయడం ప్రారంభించారు. ధరలు పతనావ్యవస్థకు చేరుకోవడంతో రైతులు సాగులో దివాలా తీశారు.

గత ప్రభుత్వంలో కరెంటు బిల్లులతో ఊరట

ఆక్వా రైతులను ఆదుకుని నష్టాలను అదుపు చేయాలన్న ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2022 ఏప్రిల్ 1 నుంచి ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ ఆథారిటీ చట్టాన్ని తీసుకొచ్చింది. ప్రతి జిల్లాలోనూ ఆక్వా సీడ్ నాణ్యతను పరిశీలించేందుకు టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. రైతులకు గిట్టుబాటు ధరల కల్పన, ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులకు పర్యవేక్షణ బాధ్యతను ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ ఆథారిటీకి అప్పగించింది. ఆక్వా కరెంటు చార్జీలను యూనిట్ ధర రూ.4 నుంచి రూ.1.50లకు తగ్గించింది.

జిల్లాలోని సాగు

ప్రస్తుతం తిరుపతి, నెల్లూరు జిల్లాలో 11 వేల ఎకరాల్లో రొయ్యల హార్వెస్టింగ్ చేస్తున్నారు. ఏడాదికి రెండు క్రాపుల్లో రైతులు రొయ్యలను ఉత్పత్తి చేస్తున్నారు. అందులో మొదటి ఏడాదిలో 3.75 లక్షల టన్నులు, రెండో క్రాపులో 2 లక్షల టన్నుల రొయ్యలను ఉత్పత్తి అవుతున్నాయి. ఈ రొయ్యలు 90 శాతం వరకు ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. హెక్టారు విస్తీర్ణంలో రొయ్యల సాగుకు రూ.4.70 లక్షల ఖర్చు అవుతుంది. లక్ష రొయ్య పిల్లలు, ట్రాన్స్‌పోర్టుతో కలిపి రూ.70 వేలు, మేత 1800 కిలోలకు రూ.1.50 లక్షలు, కరెంటు బిల్లులు రూ.30 వేలు, కెమికల్స్ రూ.45 వేలు, చెరువుకు లీజు రూ.1.50 లక్షలు, కాపలా, ఫీడ్ బాయ్స్, ల్యాబ్ పరీక్షలు, తదితరాలకు రూ.25 వేల వరకు ఖర్చు అవుతుంది. క్రాపు బాగా వస్తే హెక్టారుకు 1300 కిలోల వరకు దిగుబడి వస్తుంది. ధరలు బాగుంటే సుమారు రూ.4.5 లక్షల నుంచి రూ.5 లక్షల ఆదాయం వస్తుంది. ప్రస్తుతం రెండు జిల్లాల్లోని వ్యాపారులు సిండికేట్‌గా మారి బయట ప్రాంతాల నుంచి వ్యాపారులను రానివ్వకుండా, ధరలు పెంచకుండా అడ్డుకుంటున్నారు. ధరలు లేనప్పుడు స్టోరేజ్ చేసుకునే వెసులుబాటు లేక రైతులు తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. ఫలితంగా హెక్టారుకు రూ.లక్ష వరకు నష్టం వస్తోంది.

ఒకప్పుడు డాలర్ సేద్యంగా మార్చిన టైగర్ రొయ్యలు

మొట్టమొదటి సారిగా ఆక్వా సాగు 1990లో వాకాడు మండలం వాలమేడు గ్రామంలో మొదలైంది. ఎంపీఎఫ్ఎల్ కంపెనీ వారు ఉప్పునీటి ఆధారంగా 850 ఎకరాల్లో టైగర్ రొయ్యల సాగును ప్రారంభించారు. అది పదేళ్ల పాటు రైతులకు మంచి లాభాలను తెచ్చి పెట్టింది. దీంతో ప్రతి ఒక్కరూ టైగర్ రొయ్యల సాగు వైపు దృష్టి సారించారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి సాగులోకి వచ్చి రూ.కోట్లు సంపాదించారు. టైగర్ రొయ్యల సాగు రాను రాను నకిలీల దెబ్బకు కనుమరుగైంది. తర్వాత వచ్చిన స్కాంపీ, వెనమీ రొయ్యల సాగు దశాబ్దం పాటు లాభాలు తెచ్చిపెట్టింది. ఏడేళ్లుగా సాగులో నకిలీ తాకిడి ఎక్కువగా ఉండడంతో సాగు విస్తీర్ణం తగ్గింది.

కృత్రిమ పద్ధతిలో పిల్లలు తయారీ

తిరుపతి జిల్లాలో 21 రొయ్య పిల్లల హేచరీలు ఉన్నాయి. కొందరు హేచరీ యజమానులు కృత్రిమ పద్ధతిలో రొయ్య పిల్లలను ఉత్పత్తి చేసి రైతులకు అంటగడుతున్నారు. చెరువుల్లో వదిలిన కొన్ని రోజులకే సగానికి పైగా పిల్లలు చనిపోతున్నాయి. మిగిలినవి వైరస్‌లతో కొట్టు మిట్టాడుతున్నాయి. వీటిని కాపాడుకునేందుకు రైతులు ఫీడ్ తెచ్చి వేసినా ఫలితం ఉండడం లేదు.

వెనక్కి వస్తున్న కంటైనర్లు

భారతదేశం నుంచి రొయ్యలు ఎక్కువగా యూరోపియన్ దేశాలకు వెళ్తుంటాయి. కొంతమంది రైతులు అత్యుత్సాహంతో నిషేధిత యాంటీ బయోటిక్స్ మందులు వాడుతున్నారు. దీంతో ఇతర దేశాలకు వెళ్లిన రొయ్యల కంటైనర్లను అక్కడ తనిఖీ చేసి యాంటీ బయోటిక్స్ అవశేషాలు ఉన్నాయంటూ తిరిగి పంపించేస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న రొయ్యల ప్రాసెసింగ్ చేసే కంపెనీల వ్యాపారులు ఎగుమతులు నిలిచిపోయాయంటూ సిండికేట్‌గా మారి రైతుల నుంచి తక్కువ ధరలకు రొయ్యలను దోచుకుంటున్నారు. తరచూ నష్టాలు వస్తుండడంతో రైతులు 80 శాతం విస్తీర్ణంలో సాగును వదిలేశారు.

సీడ్, ఫీడ్ ధరలు తగ్గించాలి



రొయ్యల ధరలు తగ్గినప్పుడు పెట్టుబడులు కూడా తగ్గాలి. ప్రస్తుతం ధరలు లేకపోవడంతో హెక్టారుకు సుమారు రూ.లక్ష వరకు నష్టం వస్తోంది. గత ప్రభుత్వం కరెంటు బిల్లు యూనిట్‌కి రూ.4 నుంచి రూ.1.50కు తగ్గించింది. లేదంటే ఆక్వా సాగులో మరింత నష్టాలు వచ్చేవి. రొయ్యల ధరలు తగ్గినప్పుడు మేత, పిల్లల ధరలు కూడా తగ్గిస్తే రైతులకు ఊరట కలుగుతుంది.

– ఎన్ మధురెడ్డి, ఆక్వా రైతు, ముట్టెంబాక

సాగు చేయలేకున్నాం



నేను వాకాడు మండలం కొండూరు పాళెం వద్ద పదేళ్లుగా భూమిని కౌలుకు తీసుకుని ఆక్వా సాగు చేస్తున్నాను. రోజు రోజుకూ ధరలు పతనం అవుతుండడంతో తీవ్ర నష్టాలు వస్తున్నాయి. నకిలీ ఫీడ్, సీడ్‌లతో ఉత్పత్తులు బాగా తగ్గుతున్నాయి. ప్రస్తుతం పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా 100 కౌంటు రొయ్యలు కిలో రూ.300 ధర పలికితే సాగు చేయవచ్చు. లేదంటే సాగు చేయలేము.

– కె.బాబు, ఆక్వా కౌలు రైతు, కల్లూరు

పోలీస్ స్టేషన్ ఎదుట ముస్లింల ఆందోళన

– నిందితులకు కొమ్ము కాస్తున్నారని నిరసన



పోలీస్ స్టేషన్ ఎదుట బాధిత కుటుంబంతో కలిసి ఆందోళన చేస్తున్న ముస్లింలు

చిల్లకూరు: గూడూరు పట్టణంలో శనివారం జరిగిన హత్య కేసుకు సంబంధించిన నిందితులను పోలీసులు వదిలేసి వారికి కొమ్ము కాస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులతో ముస్లింలు పెద్ద ఎత్తున ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ముస్లింల కథనం.. బనిగేసాహెబ్ పేటకు చెందిన అల్లాబక్షు అనే వ్యక్తి మసీద్ వీధికి చెందిన సోనియాతో వివాహమైంది. అయితే వీరు కొంతకాలంగా వేరుగా ఉంటున్న సమయంలో శనివారం సోనియా సోదరులు జకీర్, షకీర్‌తో కలసి మాట్లాడుకుంటుండగా ఆమె భర్త అల్లాబక్షు అక్కడికి వచ్చి జకీర్‌ను రోకలి బండతో కొట్టడంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. దీంతో అల్లాబక్షుతో పాటు అతని తల్లిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే నిందితుడి తల్లిని ఆదివారం రాత్రి పోలీసులు వదలివేయడంతో ఆమె ఇంటికి చేరుకుంది. ఇది గమనించిన ముస్లింలు..పోలీసులు హత్యకు పాల్పడిన వారికి కొమ్ము కాస్తున్నారంటూ పోలీస్ స్టేషన్ వద్ద నిరసనకు దిగారు. అయితే పోలీసులు మాత్రం రాత్రి సమయంలో మహిళను స్టేషన్‌లో ఉంచడం సరి కాదని, అందుకే ఆమెను ఉదయం రావాలని ఇంటికి పంపినట్లు తెలిపారు.

నేటి నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

సూళ్లూరుపేట రూరల్ /సైదాపురం: సూళ్లూరుపేట, సైదాపురం మండలాల్లోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం నుంచి 14వ తేదీ వరకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు మండల పరిషత్ కార్యాలయ ఏవోలు వేణుగోపాల్, శివకుమార్ తెలిపారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

చిల్లకూరు : మండలంలోని చింతవరం కొత్తపాళెం సమీపంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని సాగు చేస్తున్నట్టు ఫిర్యాదులు అందడంతో రెవెన్యూ అధికారులు ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. చింతవరం రెవెన్యూ లెక్కదాఖలాలోని 471 నుంచి 476 వరకు ఉన్న సర్వే నంబర్లలో సుమారు 13 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ క్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు వీ ఆర్వోలు,వీఆర్ఏలు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

ఇన్‌చార్జి ఆర్డీవోగా కిరణ్‌కుమార్

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ ఇన్‌చార్జి అధికారిగా గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ సోమవారం నుంచి బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ మేరకు కార్యాలయం సిబ్బంది ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సూళ్లూరుపేట ఆర్డీవో ఆర్.చంద్రముని ఈ నెల 2 నుంచి నెలాఖరు వరకు సెలవుపై వెళ్లారు. ఈ క్రమంలో గూడూరు ఆర్డీవోకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.

సెలవొస్తే చాలు యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు



యంత్రాలతో గ్రావెల్ తవ్వుతున్న టీడీపీ నేతలు

చిల్లకూరు : గత నెలలో రెవెన్యూ అధికారి ఇచ్చిన అనుమతిని అడ్డు పెట్టుకుని టీడీపీ నాయకులు సెలవు దినం వచ్చిందంటే చాలు ఇష్టానుసారంగా గ్రావెల్‌ను తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని తిప్పగుంటపాళెం సమీపంలో ఉన్న తిప్పను తెలుగు తమ్ముళ్లు తొలిచేస్తున్నారు. వర్షాలు వచ్చిన సమయంలో కండలేరు క్రీక్ పొంగి గ్రామాన్ని వరద నీరు చుట్టుముడుతుంది. ఆ సమయంలో గ్రామస్తులు తమ పశువులను తిప్పపైకి తరలించి కాపాడుకుంటూ ఉంటారు. ప్రస్తుతం రొయ్యల గుంటల వద్ద రోడ్డుకని చెబుతూ టీడీపీ నేతలు గత నెల 27వ తేదీన చిల్లకూరు తహసీల్దార్ శ్రీనివాసులుకు అర్జీ ఇచ్చారు. పరిశీలించాలని ఆయన వీఆర్‌వోను ఆదేశించారు. ఆ పత్రమే అనుమతి అని చూపుతూ ఆదివారమైతే చాలు తిప్పపైన యంత్రాలతో ఇష్టారాజ్యంగా గ్రావెల్‌ను తవ్వి తరలిస్తున్నారు. ఇప్పటికే సుమారు రెండు ఎకరాల విస్తీర్ణం మేర తవ్వకాలు చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఎవరైనా తవ్వకాలను అడ్డుకునేందుకు అక్కడికి వెళితే తమకు తహసీల్దార్ అనుమతి ఇచ్చారని వాగ్వాదానికి దిగుతున్నారు. ఇంత జరుగుతున్నా గనుల శాఖాధికారులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన తిప్పను అలాగే ఉంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



ఆంజనేయస్వామి విగ్రహానికి కుంభాభిషేకం చేస్తున్న గ్రామస్తులు



కలశాలు తీసుకువస్తున్న విగ్రహ నిర్మాణ దాతలు

చిల్లకూరు : మండలంలోని ముత్యాలపాడు పంచాయతీ నాంచారమ్మ పేట గ్రామ దేవత నాంచారమ్మ ఆలయంలో ఆదివారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా చేపట్టారు. గ్రామస్తులు సొంత నిధులతో 30 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో మూడు రోజుల నుంచి పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. ఆదివారం ప్రత్యేక హోమం చేశారు. గ్రామస్తులు సామూహికంగా విగ్రహానికి కుంభాభిషేకం చేశారు.

బైక్ ఢీకొని యువకుడి మృతి

తడ: జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి బైక్ ఢీకొని యువకుడు మృతిచెందాడు. రామాపురానికి చెందిన ఆంబాకం మునుస్వామి(25) తడ వద్ద రోడ్డు పక్కన ఉండగా గుమ్మిడిపూండి నుంచి తడవైపు వెళుతున్న బైక్ ఢీకొంది. మునుస్వామి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌లో వచ్చిన వ్యక్తి పారిపోయాడు. మృతుడు పారిశుద్ధ్య కార్మికునిగా పని చేస్తున్నట్టు తెలిసింది.

ఆటంకాల నడుమ విద్యాభ్యాసం



పాఠశాల ప్రధాన గేట్లు వద్ద పెరిగిన ముళ్లచెట్లు

దొరవారిసత్రం : మండలంలోని కల్లూరుకండ్రిగ గ్రామ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విద్యాభ్యాసం ఆటంకాల నడుమ కొనసాగుతోంది. పాఠశాల ప్రధాన గేటుకు ఇరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. నిర్మాణం కోసం తీసుకువచ్చిన కంకర, ఇటుకలు పాఠశాల ఆవరణలో ఎక్కడ పడితే అక్కడ అలాగే వదిలేశారు. మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంక్‌పై మూత వేయలేదు. విద్యార్థులకు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నాయుడుపేటలో కార్డన్ సెర్చ్



నాయుడుపేట మాలయకోటలో స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేట టౌన్ : శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా కార్డెన్ సెర్చ్ చేస్తున్నట్లు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. నాయుడుపేటలోని మాలయకోట (ఎంఆర్‌నగర్)లో ఆదివారం సీఐలు శ్రీనివాస రెడ్డి, మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, ఏఎస్ఐలు, పోలీసులు ఇంటింటా తనిఖీలు చేశారు. కాలనీలో అనుమానిత వ్యక్తులు ఎవరైనా ఉన్నారా, అక్రమంగా మద్యం, గంజాయి విక్రయాలు చేస్తున్నారా, వాహనాలకు రికార్డులు ఉన్నాయా తదితర విషయాలను పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ కాలనీలో ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చి చేరినా, వారి కదలికలపై అనుమానం ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయుడుపేట, ఓజిలి. దొరవారిసత్రం తదితర పోలీస్ స్టేషన్‌ల ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

శ్రీవారికి చందనాలంకరణ



గరుడ వాహనంపై ఊరేగుతున్న నృసింహుడు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి ఆదివారం చందనంతో అలంకరించారు. ఆదివారం స్వామి జన్మన క్షత్రం స్వాతి నక్షత్రం కావడంతో మూలమూర్తికి విశేష పూజలు చేశారు. అనంతరం చందనంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 9 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం చేశారు. 11 గంటలకు కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం చేశారు. రాత్రి శ్రీవారు గరుడ వాహనంపై కొలువుదీరి ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

నేరాల నియంత్రణకు కఠిన చర్యలు



గూడూరు డీఎస్పీ రమణకుమార్



గూడూరు పట్టణ సీఐ శేఖర్‌బాబు



వాకాడు సీఐ హుస్సేన్‌బాషా



వెంకటగిరి సీఐ వెంకటరమణ



నాయుడుపేట అర్బన్ సీఐ బాబీ



నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు

చిల్లకూరు : గూడూరు సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వీవీ రమణకుమార్ తెలిపారు. ఆయన ఆదివరం బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఒడిశా నుంచి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు గంజాయిని రవాణా అవుతోందన్నారు. అక్రమార్కులు గూడూరును కేంద్రంగా చేసుకున్నట్టు సమాచారం ఉందన్నారు. వారిపై ప్రత్యేక నిఘా పెట్టి కట్టడి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా గూడూరు ఒకటో పట్టణ సీఐగా శేఖర్‌బాబు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన గూడూరు ఒకటో పట్టణం, చిల్లకూరు, ఓజిలి మండలాల్లో ఎస్‌ఐగా పని చేశారు. అలాగే వాకాడు సీఐగా హుస్సేన్‌బాషా బాధ్యతలు తీసుకున్నారు. ఆయన గతంలో గూడూరు డివిజన్‌లో ఎస్‌ఐగా పనిచేశారు. ఆయనకు మంచి గుర్తింపు ఉంది.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటరమణ తెలిపారు. ఆయన ఆదివారం సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ సంగమేశ్వరరావు నాయుడుపేట రూరల్‌కు బదిలీ అయ్యారు. ప్రకాశం జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ విభాగంలో పనిచేస్తున్న వెంకటరమణ ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ వెంకటగిరి సర్కిల్ పరిధిలోని వెంకటగిరి పట్టణం, మండలాల్లోని గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ వ్యాపారులు జరగకుండా ప్రత్యేక నిఘా పెడతామని చెప్పారు. ఆయనకు ఎస్‌ఐ జిత్యానాయక్, పోలీసు సిబ్బంది స్వాగతం పలికారు.

సీఐల బాధ్యతల స్వీకరణ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట అర్బన్ సీఐగా ఎం బాబి బాధ్యతలు చేపట్టారు. ఆయన నెల్లూరు టూ టౌన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. అదేవిధంగా రూరల్ సీఐగా సంగమేశ్వరరావు బాధ్యతలు తీసుకున్నారు. ఆయన వెంకటగిరి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. వీరికి నాయుడుపేట ఎస్‌ఐ గోపి, ఓజిలి, పెళ్లకూరు, దొరవారిసత్రం ఎస్‌ఐలు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

పేదలపై పెత్తందారుల జులుం

- బాతులు పెంచుకోవాలంటే నగదు చెల్లించాలని హుకుం
- కట్టలేమని ప్రాధేయపడినా కనికరించని వైనం



పంటలు కోసేసిన పొలాల్లో మేస్తున్న బాతులు

పెళ్లకూరు : కడుపు చేతపట్టుకుని ఊరూరా తిరుగుతూ బాతు పిల్లలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్న పేదలపై గ్రామాల్లోని పెత్తందారులు జులుం ప్రదర్శిస్తున్నారు. వేలకు వేలు నిర్బంధ వసూలు చేస్తున్నారు. కొంత కాలంగా వర్షాలు కురవకపోవడంతో నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం తదితర ప్రాంతాల నుంచి పలు కుటుంబాలు బాతులు మేపుకొనేందుకు పెళ్లకూరు మండలంలోని పలు గ్రామాలకు వచ్చాయి. ఇప్పుడిప్పుడే వరికోతలు మొదలైనందు వల్ల చెరువు సమీపాల్లోని వ్యవసాయ పొలాల్లో గుడారాలు వేసుకుని బాతులు మేపుకుంటున్నారు. వారిపై గ్రామాల్లోని పెత్తందార్ల కన్ను పడింది. పొలాల్లో బాతులు మేపుకోవాలంటే గ్రామానికి నగదు చెల్లించాలని హుకుం జారీ చేశారు. తమ ప్రాంతాల్లో నీరులేక పంటలు ఎండిపోయాయని, బాతులను కాపాడుకోవడానికి గత్యంతరం లేక ఇక్కడికి వచ్చామని ప్రాధేయపడినా వారు కనికరించడం లేదు. నెలబల్లిలో రూ.1.02 లక్షలు, చెంబేడులో రూ.2 లక్షలు, రావులపాడులో రూ.30 వేలు, సీఎస్‌పేటలో రూ.40 వేలు వసూలు చేసినట్టు సమాచారం. బాతులు మేపుకునే వారి నుంచి వసూలు చేసిన నగదును పంచాయతీలో అభివృద్ధి పనుల కోసం వినియోగిస్తామని చెప్పి పెత్తందారులే స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.